సాక్షి నల్లగొండ

గురువారం । 18 । జూలై । 2024



గంజాయి ముఠా అరెస్ట్

గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను కేతే పల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



స్వయం ప్రతిపత్తి..

కోదాడ పట్టణంలోని కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలకు యూజీసీ అటానమస్ హోదా ప్రకటించింది. - 10లో

గరిష్టం / కనిష్టం

32°/ 25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రైతువేదికల వద్ద ఏర్పాట్లు చేయాలి

నల్లగొండ: రుణమాఫీ పొందిన రైతులతో గురువారం రైతు వేదికల వద్ద నిర్వహించనున్న సంబరాలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన జిల్లా వ్యవసాయాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల లోపు రుణాలు ఉన్న రైతులకు రుణమాఫీ ప్రకటించిందని, గురువారం రూ.లక్ష లోపు రుణాలున్న రైతుల రుణాలు మాఫీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రుణమాఫీ పొందిన రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేరుగా మాట్లాడనున్నట్లు తెలిపారు. రైతు వేదికల వద్ద అవసరమైన ఎల్ఈడీ స్క్రీన్లు, ఇతర ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

నకిరేకల్ మున్సిపాలిటీలో అవిశ్వాసం

- కలెక్టర్‌కు నోటీసు ఇచ్చే యోచనలో కౌన్సిలర్లు

నకిరేకల్: నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ (బీఆర్ఎస్) పై అవిశ్వాస నోటీస్ ఇచ్చేందుకు కాంగ్రెస్ కౌన్సిలర్లు రంగం సిద్ధం చేశారు. మొత్తం 20 వార్డులకు 14 మంది కౌన్సిలర్లతో చైర్మన్‌పై అవిశ్వాస నోటీస్ ఇచ్చేందుకు సంతకాలు పూర్తి చేసినట్లు సమాచారం. గురు, శుక్రవారాల్లో అధికారికంగా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిసింది. మేజర్ పంచాయతీగా ఉన్న నకిరేకల్ 2020లో మున్సిపాలిటీగా ఏర్పడింది. అనంతరం 2021 మేలో మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. 20 వార్డులకు మెజారిటీ స్థానాలు గెలుచుకున్న బీఆర్ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకుంది. నకిరేకల్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి వేముల వీరేశం విజయం సాధించడంతో మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని కూడా దక్కించుకోవాలని కాంగ్రెస్ దృష్టి సారించింది. వీరేశం గెలిచిన అనంతరం బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్‌తో పాటు మరో ఇద్దరు కౌన్సిలర్లు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ బలం 12 చేరుకుంది. బీఆర్ఎస్‌కు చెందిన మరో ఇద్దరు కౌన్సిలర్లు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. దీంతో చైర్మన్‌పై అవిశ్వాస నోటీస్ ఇచ్చేందుకు సంతకాలు చేసినట్లు సమాచారం. చైర్మన్ పదవి దక్కాలంటే 14 కౌన్సిలర్లు అవసరం ఉండగా 14 మంది కూడా నోటీస్‌పై సంతకాలు చేసినట్లు తెలుస్తోంది.

యాదాద్రిలో లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో తొలి ఏకాదశిని పురస్కరించుకొని విశేష పూజలు కొనసాగాయి. ఏకాదశి కావడంతో ఆలయంలోని ముఖ మండపంలో గల సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత సుగ్రంథ పరిమలాలు వెదజల్లే పుష్పాలు, తులసీ దళాలతో లక్ష పుష్పాలతో అర్చన నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లకు హారతి నివేధన జరిపించారు. తొలి ఏకాదశి కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో శ్రీస్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

రావినారాయణరెడ్డి విగ్రహం పరిశీలన

భువనగిరి రూరల్ : హైదరాబాద్‌లో రూపుదిద్దుకుంటున్న తెలంగాణ సాయుధ పోరాటయోధుడు, మాజీ ఎంపీ రావినారాయణరెడ్డి కాంస్య విగ్రహాన్ని బుధవారం రావినారాయణరెడ్డి సేవా సంస్థ సభ్యులు పరిశీలించారు. విగ్రహాన్ని రావి నారాయణరెడ్డి స్వగ్రామమైన భువనగిరి మండలంలోని బొల్లెపల్లిలో ప్రతిష్ఠించనున్నారు. విగ్రహానికి తల, చేతులు అమర్చాల్సి ఉందని రావి నారాయణరెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు చెరుపల్లి శ్రీనివాస్, కార్యదర్శి రావి సుఖేష్‌రెడ్డి ఉన్నారు. అదే విధంగా అభిమానులు 81810 28642 నంబర్‌కు గూగుల్ పే లేదా, రావినారాయణరెడ్డి సేవా సంస్థలకు విరాళాలు అందజేసి విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని సేవా సంస్థ సభ్యులు కోరారు. దాతల పేర్లు శిలాఫలకం మీద రాయనున్నామని, 98830 89999 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

తొలి ఏకాదశి పూజలు



నల్లగొండలోని రామకోటి దేవాలయంలో ప్రత్యేక అలంకరణలో శివలింగం



తొలి ఏకాదశి సందర్భంగా వాడపల్లిలో కృష్ణా, మూసీ నదుల సంగమంలో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు

మొహర్రం సందడి





మొహర్రం సందర్భంగా నల్లగొండలోని పాతబస్తీలో పీర్ల ఊరేగింపు

చండూరు మండలం చామలపల్లిలో పీరుతో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


21న జిల్లా స్థాయి చెస్ పోటీలు

నల్లగొండ టూటౌన్: అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా నల్లగొండ పట్టణంలోని కేంద్రియ విద్యాలయంలో ఈనెల 21న బాల, బాలికలకు జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, ఆర్బిటర్ విశ్వప్రసాద్ బుధవారం తెలిపారు. 11, 13, 15 సంవత్సరాల వయసు విభాగాల్లో పోటీలు ఉంటాయని, ప్రతి విభాగంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 99854 23823 వాట్సాప్ నంబర్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

కరుణించవా.. కృష్ణమ్మ!

నాగార్జున సాగర్ ఆయకట్టుకు ఈసారైనా సాగునీరు అందేనా..

- ఆల్మట్టి నుంచి దిగువకు నీరు విడుదలైనా తొలగని అనుమానాలు
- గతేడాది ఇలాగే ఊరించినా.. ఆయకట్టుకు అందని సాగునీరు
- ఇప్పటికే అడుగంటిన సాగర్ ప్రాజెక్టు
- కనీస నీటిమట్టం 510 అడుగులు.. ఇప్పుడున్నది 503 అడుగులే
- శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తితో సాగర్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో



సాగర్‌లో అడుగంటిన నీరు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నాగార్జునసాగర్ ఆయకట్టుకు ఈసారైనా సాగునీరు అందుతుందా అని రైతులు ఎదురుచూస్తున్నారు. కృష్ణా నదికి ఎగువన ఆలమట్టి డ్యాం నుంచి దిగువకు నీటి విడుదల ప్రారంభమైనా.. సాగర్ ఆయకట్టు రైతుల్లో అనుమానాలు పోవడం లేదు. గతేడాది ఇలాగే ఊరించి ఉసూరుమనిపించడంతో ఆయకట్టుకు సాగునీరు అందలేదు. ఈసారి కూడా వరదలు వస్తాయా? ఆశలు నెరవేరుతాయా? లేదా? అన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి బుధవారం 3,585 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ప్రారంభమైంది. శ్రీశైలంలో విద్యుత్ ఉత్పాదన ద్వారా నాగార్జునసాగర్‌కు కూడా 19,284 క్యూసెక్కుల నీరు వస్తోంది.

కనిష్ట స్థాయికి దిగువకు నీటిమట్టం

నాగార్జునసాగర్ జలాశయంలో నీరు కనీస నీటి మట్టం కంటే కిందకు పడిపోయింది. జూలై రెండో వారం దాటినా కృష్ణా పరీవాహక ప్రాంతంలోని సాగర్ ఎగువన ఉన్న ప్రాజెక్టుల్లోకి ఆశించిన మేర నీరు చేరలేదు. దీంతో సాగర్ ఆయకట్టు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. సాగర్ కనీస నీటి మట్టం 510 అడుగులు కాగా.. బుధవారం అది 504 అడుగులు ఉంది. నాలుగు జిల్లాల్లో 6.30 లక్షల ఎకరాల ఆయకట్టు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గతేడాది కూడా శ్రీశైలం నుంచి వరద నీరు కిందకి రాక, సాగర్ నుంచి నీటిని విడుదల చేయకపోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంటలను కాపాడుకునేందుకు పెద్ద ఎత్తున బోర్లు వేసుకోవాల్సి వచ్చింది.

ఐదోసారి కరువు!

నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 121.71 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఇదీ మినిమమ్ డ్రా డౌన్ లెవల్ (ఎండీడీఎల్) 510 అడుగుల (131.67 టీఎంసీలు) కంటే తక్కువగా ఉంది. గడిచిన 22 ఏళ్లల్లో ఈ పరిస్థితి రావడం ఇది ఐదోసారి అని అధికారులు చెబుతున్నారు. మొదటిసారిగా 1992 సంవత్సరంలో 499.7 అడుగులకు సాగర్ నీటి మట్టం పడిపోయింది. 2002లో 500 అడుగులకు, 2003 సంవత్సరంలో 496.8 అడుగులకు పడిపోగా, 2017లో 501 అడుగులకు పడిపోయింది. ఈసారి 503 అడుగులకు పడిపోయి బుధవారం 504 అడుగులకు పెరిగింది. ఆల్మట్టికి వస్తున్న వరద మరో వారం పాటు అలాగే కొనసాగితే నారాయణపూర్, జూరాల ఆ తరువాత శ్రీశైలంకు అంటే ఐదారు రోజుల్లో వరద చేరుకుంటుందని అధికారులు చెబుతున్నారు. లేదంటే ఇబ్బంది తప్పదని పేర్కొంటున్నారు.

6లక్షల 30వేల ఎకరాలకు కష్టం

సాగర్ ఎడమ కాలువ కింద నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్, మిర్యాలగూడ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో కాలువలు, ఎత్తిపోతల పథకాల కింద 1,45,720 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గంలోని పది మండలాల్లో 2,29,961 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో పాలేరు, సత్తుపల్లి, మధిర, వైరా, ఖమ్మం నియోజకవర్గంలోని 15 మండలాల్లో 2,54,408 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారు. ఈ మూడు జిల్లాల్లో మొత్తంగా 6,30,089 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. పైనుంచి సాగర్‌కు వరదలు రాకపోతే ఈసారి కూడా గతంలో నెలకొన్న కరువు పరిస్థితులే రానున్నాయి.

నీటిని విడుదల చేయాలంటే..

సాగర్ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేయాలంటే సాగర్‌లో కనీసం 570 అడుగుల నీరు ఉండాలని అధికారులు చెబుతున్నారు. దానికి తోడు ఎగువన ఉన్న జలాశయాలన్నీ నిండి ఉండి నదిలో సుమారుగా 100టీఎంసీలకు పైగా నీరుంటే కాల్వలలకు నీరిచ్చే పరిస్థితి వస్తుందని పేర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం కుడి, ఎడమ కాల్వలకు కలిపి పంట పొలాలకు 80 రోజులు వారబందీలో 264 టీఎంసీల (ఒక్కోదానికి 132 టీఎంసీలు) నీరు ఇవ్వాల్సి వస్తుందని, ఆ మేరకు వరద వస్తేనే నీటిని విడుదల చేయడం సాధ్యం అవుతుందని పేర్కొంటున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 885 అడుగులు (215.81 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 808.8 అడుగులు (33.62 టీఎంసీల) నీరు మాత్రమే ఉంది.

ఇంకా తగ్గితే జంటనగరాలకు తంటా

సాగర్‌లో నీటి మట్టం ఇంకా తగ్గితే నల్లగొండతోపాటు హైదరాబాద్ జంటనగరాలకు తాగునీటి కష్టాలు ఎదురవుతాయి. ఇప్పటికే 510 అడుగులకంటే నీరు తగ్గిపోవడంతో ఎమర్జెన్సీ మోటార్లను ఏర్పాటు చేశారు. 2017 సంవత్సరంలో 500 అడుగులకు నీటి మట్టం పడిపోవడంతో సాగర్ వెనుక జలాల్లో అప్రోచ్ కెనాల్ తవ్వి (డ్రెడ్జింగ్) ఎమెర్జెన్సీ మోటార్ల వరకు నీటిని తీసుకు వచ్చారు. వరద ప్రవాహం పెరుగకపోతే మాత్రం ఇబ్బంది అవుతుందని, డ్రెడ్జింగ్ చేయాల్సి వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

నల్లగొండ మున్సిపల్ కమిషనర్‌తో 19న ఫోన్‌ఇన్

నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం అధ్వానంగా ఉందా.. ఓపెన్ ప్లాట్లు, ఖాళీ స్థలాలు చెత్తాచెదారంతో నిండుకు పోయాయా.. డ్రెయినేజీలు, రోడ్లు సరిగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా, అయితే మీ సమస్యలపై నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయండి. మున్సిపల్ కమిషనర్‌తో ఈనెల 19వ తేదీన 'సాక్షి'ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది.



కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్

తేది. 19.07.2024 శుక్రవారం

సమయం : ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 11.00 గంటల వరకు

డయల్ చేయాల్సిన ఫోన్ నంబర్ : **70139 57178**

82,401 మందికి రుణమాఫీ

- రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతుల లెక్క తేల్చిన ప్రభుత్వం
- నేడు సాయంత్రం వరకు రైతుల ఖాతాల్లో జమకానున్న మొత్తం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,74,967 మందికి ప్రయోజనం
- రైతు వేదికల వద్ద సంబరాలకు ఏర్పాట్లు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రూ.లక్ష లోపు తీసుకున్న రైతుల రుణాలను ప్రభుత్వం గురువారం మాఫీ చేయనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,74,967 మంది రైతులు ఉన్నట్లు ప్రభుత్వం లెక్కలు తేల్చింది. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.2 లక్షలలోపు రుణమాఫీ అయ్యే రైతులు 5.5 లక్షల మంది ఉండగా, అందులో మొదటి జాబితా ప్రకారం రూ.లక్ష లోపు తీసుకున్న 1,74,967 మంది రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేయనుంది. గురువారం సాయంత్రం వరకు రైతుల ఖాతాల్లో ఆ మొత్తాలను జమ చేయనుంది. దాంతో బ్యాంకులు వాటిని మినహాయించుకోనున్నాయి. ప్రభుత్వం జిల్లా వ్యవసాయ శాఖకు అందించిన మొదటి విడత సమాచారం ప్రకారం నల్లగొండ జిల్లాలో 82,401 మంది రైతులకు రుణ మాఫీ ద్వారా లబ్ధి చేకూరనుంది. అలాగే యాదాద్రి భువనగిరి జిల్లాలో 36,482 మందికి, సూర్యాపేట జిల్లాలో 56,084 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

రైతువేదిక వద్ద సంబరాలు..

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రూ. 2 లక్షల లోపు రుణ మాఫీ హామీ అమలులో భాగంగా గురువారం చేయబోయే రూ.లక్షలోపు రుణమాఫీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని నిర్ణయించింది. నిధులు జమ కాగానే సాయంత్రం అన్ని మండలాలు, గ్రామాల్లోని రైతువేదిక వద్ద సంబరాలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ప్రధాన కూడళ్ల నుంచి రైతు వేదికల వరకు ర్యాలీలు నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారు. మరోవైపు ఆగస్టు 15వ తేదీలోగా రూ. 2 లక్షలలోపు రుణ మాఫీ చేస్తామని ఇదివరకే ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ ప్రక్రియను కూడా త్వరలోనే చేపట్టనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి శ్రావణ్‌కుమార్ తెలిపారు.

నల్లగొండలో కృతజ్ఞత సభ

నల్లగొండ: రూ.లక్ష లోపు రుణమాఫీని పురస్కరించుకొని గురువారం నల్లగొండ సమీపంలోని ఎంఎస్‌ఆర్ గార్డెన్స్‌లో కృతజ్ఞత సభ నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. మధ్యాహ్నం 12 గంటలకు జిల్లాలోని ఆయా గ్రామాల నుంచి రైతులు ట్రాక్టర్లపై ర్యాలీగా బయల్దేరి నల్లగొండలోని ఎంఎస్‌ఆర్ గార్డెన్స్‌కు చేరుకుంటారు. అనంతరం రైతుల వ్యవసాయ విధానాలు, రుణమాఫీ తదితర అంశాలపై డీసీఓ, సీఈఓ, ఎన్‌డీసీసీ, డీఏఓలు ఓరియంటేషన్ ప్రసంగాలు చేయనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. అనంతరం 4 గంటలకు ఎంఎస్‌ఆర్ గార్డెన్స్‌తోపాటు రైతు వేదికల్లో ఏర్పాటు చేసే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి పలువురి రైతులతో నేరుగా మాట్లాడనున్నారు. ఇందుకోసం జిల్లా యంత్రాంగం ఎల్ఈడీ స్క్రీన్లు, ఇతర ఏర్పాట్లు చేస్తోంది.

మండలాల వారీగా రూ.లక్ష లోపు రుణమాఫీ అయ్యే రైతుల వివరాలు..

మండలం	రైతులు	మండలం	రైతులు	మండలం	రైతులు
శాలిగౌరారం	3,019	మాడ్గులపల్లి	2,702	చందంపేట	1,706
కేతేపల్లి	2,266	మిర్యాలగూడ	4,093	గుండ్లపల్లి	3,370
నకిరేకల్	1,963	దామరచర్ల	1,976	దేవరకొండ	2,668
కట్టంగూర్	2,515	అడవిదేవులపలి	1,118	కొండమల్లేపల్లి	2,302
చిట్యాల	3,085	త్రిపురారం	3,194	చింతపల్లి	2,990
నార్కట్‌పల్లి	2,466	నిడమనూరు	3,132	నేరడుగొమ్ము	1,314
నల్లగొండ	3,141	అనుముల	2,322	నాంపల్లి	3,539
కనగల్	3,043	పెద్దవూర	2,932	మర్రిగూడ	2,491
తిప్పర్తి	2,174	తిరుమలగిరిసాగర్	2,696	చండూరు	3,062
వేములపల్లి	2,366	గుర్రంపోడు	2,900	మునుగోడు	2,967
		పీఏపల్లి	2,889	మొత్తం	82,401

అంగన్‌వాడీలకు ఊరట

- టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్
- రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వులు
- జిల్లాలో 43 మంది 65 ఏళ్లు పైబడిన అంగన్‌వాడీ టీచర్లు



మిర్యాలగూడ ఆర్డీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందనున్నాయి. రెండు, మూడు రోజుల్లో జీఓ విడుదల చేస్తామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొనడంతో టీచర్లు, ఆయాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష వరకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 2023 సెప్టెంబరు 10వ తేదీ నుంచి అక్టోబరు 4వ తేదీ వరకు 24 రోజుల పాటు సమ్మెలోకి దిగిన విషయం తెలిసిందే. అయితే రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు ఇస్తామని ప్రకటించడంతో వారు ఇటీవల 15 రోజుల పాటు నిరసన తెలిపారు. టీచర్లకు కనీసం రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్షతో పాటు ఉద్యోగ విరమణ తరువాత ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే మంత్రి సీతక్క అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష రూపాయలు ఇస్తామని మంగళవారం ప్రకటించారు.

జిల్లాలోని 9 ప్రాజెక్టుల పరిధిలో..

నల్లగొండ జిల్లాలోని 9 ప్రాజెక్టుల పరిధిలో ప్రస్తుతం 65 ఏళ్లు పైబడిన అంగన్‌వాడీ టీచర్లు 43 మంది ఉండగా 65 ఏళ్లు పైబడినవారితో పాటు ఇతర కారణాలతో 381 వరకు హెల్పర్లు వెకెన్సీలో ఉన్నాయి. అయితే 65 ఏళ్లు పైబడిన వారిని విధుల నుంచి తొలగించారు. రిటైర్మెంట్ అయ్యే వారం దరూ 30 నుంచి 35 ఏళ్లు విధులు నిర్వర్తించిన వారే. అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్లు, హెల్పర్లు చాలా మందికి 40 ఏళ్లు పైబడిన అనుభవం ఉంది. అయితే అప్పట్లో కేవలం రూ.150 గౌరవ వేతనంతో విధుల్లో చేరారు. ప్రస్తుతం నెలకు రూ.13,650, హెల్పర్లకు రూ.7,800 చెల్లిస్తున్నారు.

పింఛన్ సౌకర్యం కల్పించాలి



రిటైర్మెంట్ అయిన అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం చాలా సంతోషకరంగా ఉంది. ఉద్యోగ విరమణ పొందిన వారికి పింఛను సౌకర్యం కూడా కల్పించాలి.

– తూడి అరుణ, అంగన్‌వాడీ టీచర్, మిర్యాలగూడ మండలం

తక్షణమే జీఓ అమలు చేయాలి



రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ అందుకు సంబంధించిన జీఓను విడుదల చేస్తేనే నమ్మకం కలుగుతుంది. అదే విధంగా స్వచ్ఛంద పదవి విరమణ పొందిన వారికి కూడా ఇది వర్తింపజేయాలి.

– అంబటి నాగ మణెమ్మ, అంగన్‌వాడీ టీచర్, అనుముల మండలం

వైభవంగా గరుడ వాహన సేవ

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో బుధవారం సాయంత్రం శ్రీరాజ్యలక్ష్మిచెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామిని గరుడవాహనంపై ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం శ్రీస్వామివారిని గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. స్వామివారు ఆలయ ప్రవేశానంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, వంశీకృష్ణమాచార్యులు పాల్గొన్నారు.



స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగిస్తున్న అర్చకులు

భూ వివాదంలో హెడ్‌కానిస్టేబుల్ జోక్యం!

- బాధితుల వద్ద డబ్బులు తీసుకుంటున్న వీడియో వైరల్
- విచారణ జరిపి సస్పెండ్ చేసిన సీపీ

సంస్థాన్ నారాయణపురం: జిల్లాలోని సంస్థాన్ నారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ హెడ్‌కానిస్టేబుల్ భూ తగాదా విషయంలో బాధితుల నుంచి డబ్బులు తీసుకుంటున్న వీడియో సోషల్ మీడియోలో బుధవారం సాయంత్రం చక్కర్లు కొట్టింది. సంస్థాన్‌నారాయణపురం మండల పరిధిలోని కడపగండితండాకు చెందిన రెండు కుంటుంబాల మధ్య కొంతకాలంగా భూ తగాదా నడుస్తోంది. ఈ క్రమంలో ఇరు కుటుంబాలకు చెందిన వ్యక్తులు జూలై నెలలో పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. సివిల్ వివాదం కావడంతో బయట మాట్లాడుకోవాలని వారికి ఎస్‌ఐ జగన్ సూచించారు. తర్వాత పెద్ద మనుషుల సమక్షంలో సమస్య పరిష్కరించుకున్నారు. పంచాయితీ ముగియడంతో బుధవారం స్టేషన్‌కు వెళ్లి పిటిషన్లు వెనక్కి తీసుకున్నారు. అనంతరం స్టేషన్ వెనుకభాగంలో ఓ కుటుంబం వారు హెడ్ కానిస్టేబుల్‌కు డబ్బులు ఇస్తుండగా వీడియో తీశారు. హెడ్ కానిస్టేబుల్ మాట్లాడుతున్న సంభాషణతో కూడిన వీడియోను సోషల్ మీడియోలో వైరల్ చేశారు. ఇట్టి విషయంపై ఎస్‌ఐ జగన్‌ను వివరణ కోరగా భూ సమస్య కావడంతో బయటకు పంపించాను. తర్వాత ఏం జరిగిందో తనకు తెలియదన్నారు.

సస్పెండ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు

బాధితుల నుంచి హెడ్‌కానిస్టేబుల్ డబ్బులు తీసుకుంటున్న వీడియో వైరల్‌పై రాచకొండ సీపీ సుధీర్‌బాబు విచారణ జరిపించారు. హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేశారు. మంచి పనికి రివార్డ్ ఇస్తామని, లేకపోతే పనిష్మెంట్ ఇస్తామని సీపీ హెచ్చరించారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి

నడిగూడెం: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ ఘటన అనంతగిరి మండలం త్రిపురవరం గ్రామంలో బుధవారం జరిగింది. నడిగూడెం ఎస్ఐ జి. అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురవరం గ్రామానికి చెందిన పోలూరి వెంకటరెడ్డి(55) తన వ్యవసాయ క్షేత్రం గట్టు మీద ఉన్న వేపచెట్టు కొమ్మలు నరుకుతుండగా కొమ్మలు కరెంట్ తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సంపు మోటారు సరిచేస్తుండగా..


జయమ్మ (ఫైల్)

తుంగతుర్తి: విద్యుదాఘాతంతో మహిళా మృతి చెందింది. ఈ ఘటన తుంగతుర్తి మండలం సంగెం గ్రామంలో బుధవారం జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం గ్రామానికి చెందిన ఏశమల్ల జయమ్మ (54) తన ఇంట్లోని సంపు మోటారు పనిచేయకపోవడంతో మోటారు వైర్లను పట్టుకొని సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తె మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు.

బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు


హిజ్రాలకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ రాము

కోదాడరూరల్: కోదాడ పట్టణంలో జరిగే శుభ కార్యాలు, ప్రారంభోత్సవాల వద్దకు హిజ్రాలు వెళ్లి బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని కోదాడ పట్టణ సీఐ రాము హెచ్చరించారు. బుధవారం పోలీస్ స్టేషన్‌కు హిజ్రాలను పిలిపించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇప్పటికే తమకు వసూళ్లపై అనేక ఫిర్యాదు వచ్చాయని, మరోసారి ఎక్కడైనా ఇబ్బందులకు గురిచేసినట్లు తెలిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మిర్యాలగూడ అర్బన్: అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. మిర్యాలగూడ టూటౌన్ ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని ఫ్లై ఓవర్, ప్రకాశ్ నగర్‌లో భిక్షాటన చేస్తూ జీవిస్తున్న గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం అస్వస్థతకు గురికావడంతో స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతడు చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712670150, 8186865497 నంబర్లకు సంప్రదించాలని ఎస్ఐ క్రిష్ణయ్య సూచించారు.

డబ్బులు ఇవ్వాలని బెదిరించిన ముగ్గురిపై కేసు

కోదాడరూరల్ : సెల్‌ఫోన్ లాక్కోని డబ్బులు ఇవ్వాలని బెదిరించిన ముగ్గురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కోదాడ పట్టణ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల వాసంతి ఆస్పత్రిలో పనిచేసే గుగులోతు గోపి సెల్‌ఫోన్‌ను ఈ నెల 14వ తేదీన నడిగూడెం మండలం సిరిపురం గ్రామానికి చెందిన షేక్ మౌలాలీ, కోదాడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన కాంపాటి నవీన్, ముళ్లపాటి శ్రీకాంత్ లాక్కోని డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. దీంతో గోపి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్


పట్టుబడిన గంజాయి, నిందితులను చూపుతున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, పోలీస్ సిబ్బంది

- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వారి నుంచి 73 కేజీల గంజాయి, కారు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం: ఒరిస్సా నుంచి ఉత్తరప్రదేశ్‌కు కారులో గంజాయి సరఫరా తరలిస్తున్న ముఠాను కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి బుధవారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఒరిస్సా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా కలిమెలలో నివాసముండే సుశాంత్ నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గౌతంబుద్ధ్‌నగర్ జిల్లా గ్రేటర్ నోయిడాకు చెందిన అశోక్‌కుమార్, అదే రాష్ట్రం మొరాదాబాద్‌కు చెందిన దీపుకుమార్ అలియాస్ వాసు ప్రజాపతి, ఢిల్లీలోని మండవలికి సుష్మారాయ్ గంజాయి కొనుగోలు చేశారు. ఆ గంజాయిని కారులో హైదరాబాద్ మీదుగా ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తుండగా.. మంగళవారం ఉదయం కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద వాహనా తనిఖీల్లో భాగంగా పోలీసులు కారును ఆపి పరిశీలించగా వెనుక డిక్కీలో గంజాయి లభించింది. కారులో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌కు చెందిన ప్రేమ్‌సింగ్ ఆదేశాల మేరకు తాము గంజాయిని కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. తాము రూ.20 వేలకు కూలీగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి 73 కేజీల గంజాయి, 5 సెల్ ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయి తెప్పిస్తున్న ప్రేమ్‌సింగ్, అమ్మిన సుశాంత్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. కేసును ఛేదించిన శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, కేతేపల్లి ఎస్ఐ శివతేజ, టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్‌బాబు, ఎస్ఐలు మహేందర్, మహేష్, సిబ్బందిని నల్ల గొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు.

మహిళ మెడలో బంగారం గొలుసు చోరీ


బాధితురాలితో మాట్లాడుతున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ రాంబాబు

చిలుకూరు: గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలో బంగారం గొలుసు చోరీ చేశారు. ఈ ఘటన బుధవారం చిలుకూరు మండలం బేతవోలు గ్రామ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేతవోలు గ్రామానికి చెందిన కడారి చంద్రమ్మ, ఆమె భర్త ముత్తయ్య, కుమార్తె ఉమ గ్రామ శివారులో పోలేనిగూడెం రోడ్డులోని తమ పొలంలో పనిచేస్తున్నారు. ముత్తయ్య, ఉమ పొలంలో లోపలికి వెళ్లి పనిచేస్తుండగా.. చంద్రమ్మ రోడ్డు వెంట పనిచేస్తోంది. ఈ క్రమంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ముసుగులు వేసుకొని బైక్‌పై చంద్రమ్మ వద్దకు వచ్చి ఆమెను మాటల్లో పెట్టి ఆమె మెడలోని తులం బంగారు గొలుసును లాక్కోని పారిపోయారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ సురభి రాంబాబు ఘటనా స్థలానికి వెళ్లి బాధితురాలితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు.

రోల్డ్ గోల్డ్ చైన్ లాక్కెళ్లిన దుండగుడు

మునగాల: మహిళ మెడలో రోల్డ్ గోల్డ్ చైన్‌ను దుండగుడు లాక్కెళ్లాడు. మునగాల మండల కేంద్రానికి చెందిన కాసర్ల భారతమ్మ బరాఖత్‌గూడెం శివారులో గల శ్రీలక్ష్మి తిరుపతమ్మ దేవాలయానికి వెళ్లేందుకు మునగాల నుంచి బస్సులో బయల్దేరింది. దేవాలయం ఎదురుగా బస్సు దిగి రోడ్డు దాటుతుండగా.. గుర్తుతెలియని దుండగుడు బైక్ వచ్చి భారతమ్మ మెడలో ఉన్న రోల్డ్ గోల్డ్ చైన్‌ను లాక్కోని పరారయ్యాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ కల్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


కొండ సైదులు

నకిరేకల్: నకిరేకల్‌లోని కాటమయ్య బజార్‌కు చెందిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. బుధవారం ఎస్ఐ సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం.. కాట మయ్య బజార్ కు చెందిన కొండ సైదులు(34) కూలీ పనులతో పాటు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 11వ తేదీన అతడు దుకాణానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా సైదులు ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం అతడి భార్య పద్మ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కృష్ణా జలాల్లో మునిగి వ్యక్తి మృతి

చందంపేట: నేరెడుగొమ్ము మండలంలోని వైజాక్ కాలనీలో కృష్ణా జలాల్లో మునిగి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఘట్కేసర్‌కు చెందిన చింతకంటి జగదీశ్వర్(42) తన స్నేహితులతో కలిసి వైజాక్ కాలనీకి వచ్చాడు. బుధవారం తెల్లవారుజామున స్నానం చేసేందుకు నాగార్జునసాగర్ వెనుక జలాల్లోకి వెళ్లి నీట మునిగిపోయాడు. తోటి స్నేహితులు గమనించి గ్రామస్తుల సహాయంతో జగదీశ్వర్ మృతదేహాన్ని వెలికితీశారు. సమాచారం అందుకున్న పోలీసులు దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

అనారోగ్యంతో సాంస్కృతిక సారథి కళాకారుడు మృతి


వేముల నరేశ్ (ఫైల్)

శాలిగౌరారం: మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన సాంస్కృతిక సారథి కళాకారుడు వేముల నరేశ్(40) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. నరేశ్ మృతదేహాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం నిమ్స్ హాస్పిటల్‌లో సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నరేశ్‌కు భార్య ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. నరేశ్ అంత్యక్రియలు సాయంత్రం ఊట్కూరు గ్రామంలో పూర్తయ్యాయి. అంత్యక్రియల్లో కళాకారులు వేముల పుష్ప, గిద్దె రామనర్సయ్య, చుక్క రామనర్సయ్య, మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అత్యాశతో జేబు గుల్ల

- సూర్యాపేట జిల్లాలో ఎక్కడపడితే అక్కడ పేకాట స్థావరాలు
- డబ్బులు పెట్టి పోగొట్టుకుంటున్న జూదరులు
- దాడులు నిర్వహిస్తున్న పోలీసులు
- కొందరిపై కేసులు.. మరికొందరిని వదిలేస్తున్న వైనం



సూర్యాపేట : జిల్లాలో పేకాట జోరుగా సాగుతోంది. డబ్బులు సులభంగా సంపాదించాలనే అత్యాశతో కొందరు జేబులు గుల్ల చేసుకుంటున్నారు. పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామాల్లో కూడా పేకాట స్థావరాలు విపరీతంగా పెరిగాయి. ఇటీవల కొన్నిరోజుల పాటు పోలీసులు ఇతర విధుల్లో బిజీగా ఉండడంతో అప్పటి నుంచి పేకాట స్థావరాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. సూర్యాపేట, కోదాడ సబ్ డివిజన్‌లలో పేకాట జోరుగా సాగుతోంది.

అడ్డాలు ఇవే..

పట్టణ ప్రాంతాల్లోని శివారు కాలనీలు, రద్దీ ప్రాంతాలతోపాటు ప్రధాన హోటళ్లను అడ్డాగా చేసుకుని పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ క్షేత్రాలు, అటవీ ప్రాంతాలు, ఈత, తాటి వనాల్లో పేకాట జోరుగా సాగుతోంది. అలాగే అపార్ట్‌మెంట్లు, హోటళ్లు, లాడ్జీలు, కొందరు రాజకీయ నాయకుల, బడా వ్యాపారుల ఇళ్లు పేకాటకు అడ్డాగా మారాయి. పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు చేసినప్పుడు రాజకీయ నాయకుల ఒత్తిళ్ల కారణంగా వదిలేసిన సందర్భాలు అనేకం ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.500 నుంచి రూ.ఐదు వేల వరకు బెట్టింగ్ పెట్టి పేకాట ఆడుతున్నారని సమాచారం. ఎస్సారెస్పీ కాలువ ప్రాంతాల్లో రౌండ్‌కు కనీసం రూ.వెయ్యి ఉండాల్సిందే. సూర్యాపేట పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో టేబుల్‌కు రూ.ఐదు వేల నుంచి రూ.10వేల వరకు ఆడుతున్నట్లు సమాచారం.

పాలకవీడు మండలంలోని హనుమయ్యగూడెం గ్రామంలో పోలీసులు గత సోమవారం పేకాట స్థావరంపై దాడిచేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.5వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఇటీవల మునగాల మండల కేంద్రం శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో కొందరు ఖరీదైన కార్లలో వెళ్లి పేకాట ఆడుతున్నారనే సమాచారం పోలీసులకు అందింది. పోలీసులు అక్కడికి చేరుకుని జూదరుల నుంచి ముడుపులు తీసుకుని వదిలేసినట్లు తెలిసింది.

కోదాడ పట్టణంలోని ఓ ఇంటిపై నాలుగు రోజుల క్రితం పోలీసులు దాడి చేశారు. పోలీసులు వచ్చారనే భయంతో పేకాటరాయుళ్లు పారిపోవడానికి ప్రయత్నించారు. ఓ వ్యక్తి బంగ్లాపై నుంచి దూకడంతో కాళ్లు విరిగినట్లు తెలిసింది. మొత్తం ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం.

కొన్నిచోట్ల వసూళ్లు.. మరికొన్ని చోట్ల కేసులు

జిల్లాలో పోలీసులు కొన్నిచోట్ల పేకాట స్థావరాలపై దాడిచేసి జూదరుల వద్ద నగదు వసూలు చేసి వదిలేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మరికొన్ని చోట్ల కేసులు నమోదు చేస్తున్నారు. సూర్యాపేట సబ్ డివిజన్‌లో ఇద్దరు పోలీస్ అధికారుల తీరు కొంతమంది పేకాటరాయుళ్లకు వరంలా మారింది. ఎనిమిది నెలల క్రితం అప్పటి ఎస్పీ హెగ్డే నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పేకాట స్థావరాలపై విస్తృతంగా దాడులు చేసి కేసులు నమోదు చేశారు.

సమాచారం అందించండి

పేకాట స్థావరాల సమాచారం తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలి. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. పేకాట ఆడి దొరికితే కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే హోటళ్ల నిర్వాహకులకు నోటీసులు అందించాం.

– జి.రవి, డీఎస్పీ సూర్యాపేట

ముగ్గురిని బలిగొన్న క్వారీ గుంత


ప్రమాదానికి కారణమైన క్వారీ గుంత ఇదే..


ఘటనా స్థలంలో శ్రీపాల్‌రెడ్డి, రాజు, ఉషాంక మృతదేహాలు

- ఈతకు వెళ్లి మృత్యువాత
- నిర్వహణలో లేని క్వారీని పూడ్చక పోవడంతోనే ప్రమాదం జరిగిందంటున్న గ్రామస్తులు

ఆత్మకూర్(ఎస్): మండల పరిధిలోని బొప్పారం గ్రామంలోని క్వారీ గుంతలో ఈతకు వెళ్లి బుధవారం ముగ్గురు మృతిచెందారు. నిర్వహణలో లేని క్వారీ గుంతను పూడ్చకుండా వదిలేయడంతోనే ప్రమాదం జరిగిందని గ్రామస్తులు, మృతుల కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జూపెడ గ్రామానికి చెందిన తిప్పారెడ్డి శ్రీపాల్‌రెడ్డి(42) కుటుంబ సభ్యులు, తన స్నేహితుడైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా నర్సరావుపేటకు చెందిన చామలి రాజు కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. వీరు మంగళవారం ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్‌లో గల దండుమైసమ్మ ఆలయం వద్ద శుభకార్యానికి హాజరయ్యారు. అనంతరం శ్రీపాల్‌రెడ్డి అత్తగారి ఊరైన బొప్పారం గ్రామానికి వచ్చారు. బుధవారం ఉదయం గ్రామ పరిధిలోని క్వారీ గుంతలో ఈత కొట్టేందుకు బుధవారం ఉదయం శ్రీపాల్‌రెడ్డి, తన పెద్ద కుమారుడు చేతన్‌రెడ్డి, చామలి రాజు, అతని ఇద్దరు కుమార్తెలు ఉషాంక, రితికతో పాటు శ్రీపాల్‌రెడ్డి బంధువుల అమ్మాయి వర్షిత కలిసి వెళ్లారు. బుధవారం బొప్పారం గ్రామ పరిధిలోని క్వారీ గుంతలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఉషాంక క్వారీలోకి దిగుతూ జారి అందులో పడిపోయింది. ఆమెను కాపాడేందుకు ఆమె తండ్రి చామలి రాజు క్వారీలోకి దిగుతూ జారి నీటిలో మునిగిపోతుండడంతో శ్రీపాల్‌రెడ్డి వారిని కాపాడేందుకు అందులోకి దిగాడు. రాజు చిన్న కుమార్తె రితిక కూడా జారిపడగా చేతన్‌రెడ్డి ఆమెను కాపాడి బయటకు తీసుకువచ్చాడు. ఈత రాకపోవడంతో శ్రీపాల్‌రెడ్డి, ఉషాంక, రాజు క్వారీ గుంతలో మునిగిపోయారు. క్వారీ ఎగుడుదిగుడుగా ఉండటం, అందులో నీళ్లు ఎంత లోతులో ఉన్నాయో పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతోనే వారు మృతిచెందినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. క్వారీ నిర్వహణ లేని సమయంలో వెంటనే పూడ్చివేయాలి లేదా అక్కడికి ఎవరూ వెళ్లకుండా రక్షణ ఏర్పాటు చేయాలి. కానీ క్వారీ నడిపించిన యాజమాన్యం తమకేమీ పట్టనట్లు వదిలేయడంతో మూడు ప్రాణాలు బలైపోయాయని, మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకుంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని గ్రామస్తులు అంటున్నారు.

గుంతలు పూడ్చకపోవడంతోనే ప్రమాదం

బొప్పారంలో క్వారీ గుంతలు పూడ్చకపోవడంతోనే తన అల్లుడు, మరో ఇద్దరు చనిపోయారని మృతుడు శ్రీపాల్‌రెడ్డి మామ నల్లు ఉపేందర్‌రెడ్డి ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి క్వారీ గుంటలను మూసివేయాలని ఆయన కోరుతున్నాడు. చుట్టపుచూపుగా వచ్చినవారు ఇలా క్వారీ గుంటలో పడి మృతిచెందడం కలచివేస్తోందని ఆయన రోదించాడు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్


సారా తరలిస్తున్న వ్యక్తిని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

హుజూర్‌నగర్: ద్విచక్ర వాహనంపై సారా తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం కొత్తతండాకు చెందిన బాణోత్ రవీందర్ ద్విచక్ర వాహనంపై సారా తరలిస్తుండగా.. మఠంపల్లి వద్ద ఎక్సైజ్ అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 10 లీటర్ల సారాతో పాటు వాహనం స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్ఐ జగన్మోహన్ రెడ్డి, సిబ్బంది నాగరాజు, రవికుమార్, రుక్మారెడ్డి, గోపిరెడ్డి, మణికంఠ, సంజయ్, బాలు పాల్గొన్నారు

30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

మిర్యాలగూడ టౌన్: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని బుధవారం మిర్యాలగూడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం కొత్తగూడెం వద్ద పెట్రోలింగ్ పోలీసులు బుధవారం గూడ్స్ వాహనాన్ని ఆపి పరిశీలిస్తుండగా.. డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. దీంతో పోలీసులు వాహనాన్ని వెంబడించి పట్టుకొని తనిఖీ చేయగా 30 క్వింటాళ్ల(60 తెల్ల బస్తాలు) పీడీఎస్ బియ్యం లభ్యమైంది. వేములపల్లి మండలం అన్నపురెడ్డిగూడేనికి చెందిన వాహన డ్రైవర్ చలమల్ల కార్తీక్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్ల మండలం కమ్మంపాడు గ్రామానికి కాంద్రగొండ గోపిని అదుపులోకి తీసుకొని విచారించగా.. పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన పిండిపూలు పర్వతాలు పీడీఎస్ బియ్యం గూడ్స్ వాహనంలో లోడ్ చేసి ఆంధ్రప్రదేశ్‌లో నర్సింహరావు అనే వ్యాపారికి అప్పగించమంటే వెళ్తున్నామని చెప్పారు. కార్తీక్, గోపి, పర్వతాలు, నర్సింహరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పీడీఎస్ బియ్యం తరలింపునకు సంబంధించి గత మూడు నెలల కాలంలో 11మందిపై కేసులు నమోదు చేసి 33 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పెద్దవూరలో ఏడు క్వింటాళ్లు..

పెద్దవూర: మండలంలోని తుంగతుర్తి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఏడు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ పి. వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి గ్రామం నుంచి కొంతమంది అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారని పక్కా సమాచారం అందడంతో పోలీసులు గ్రామానికి చెందిన తెలకపల్లి సాంబశివ ఇంట్లో సోదాలు నిర్వహించగా 7 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడింది. ఈ బియ్యాన్ని అదే గ్రామానికి చెందిన ఈశ్రం ఈదయ్య, వంగూరి నరేందర్, ఈశ్రం ఏడుకొండలు, దుగ్యాల సైదులు, వెంకటకృష్ణతో పాటు మరికొందరు కలిసి అధిక ధరకు వేరే వ్యక్తికి విక్రయించటానికి సాంబశివ ఇంట్లో నిల్వ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని గోదాంకు తరలించినట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చివ్వెంలలో 120 బస్తాలు..

చివ్వెంల(సూర్యాపేట): మండల పరిధిలోని వాల్యాతండాలో మంగళవారం రాత్రి డీసీఎంలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. వాల్యాతండా గ్రామానికి చెందిన బానోతు హరిప్రసాద్, ధరావత్ కృష్ణ, బీబీనగర్ మండలం చందునాయక్ తండాకు చెందిన దేవసోతు లింగా కలిసి చివ్వెంల మండలంతో పాటు పరిసర గ్రామాల్లో తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మంగళవారం రాత్రి డీసీఎంలో అక్రమంగా హైదరాబాద్‌కు తరలిస్తున్న 120బస్తాల పీడీఎస్ బియ్యంతో పాటు డీసీఎంను విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి. వెంకట్‌రెడ్డి తెలిపారు.

ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లోకి మార్చాలి

మిర్యాలగూడ టౌన్ : ముదిరాజ్ కులస్తులను బీసీ 'ఏ'లోకి మార్చాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్‌ల మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా సైదులు ప్రభుత్వాన్ని కోరారు. ఇదే విషయంపై ఈ నెల 20న తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇచ్చే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన పోస్టర్లను బుధవారం పట్టణంలోని గాంధీనగర్ ముత్యాలమ్మగుడి వీధి వద్ద ఆ సంఘం నాయకులు ఆవిష్కరించి మాట్లాడారు. ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. వెయ్యి కోట్లు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ ఇంచార్జి అవుదారపు మురళి, మాజీ మున్సిపల్ చైర్మన్ మెరుగు రోశయ్య, వైస్ చైర్మన్ బంటు సైదులు, డీసీసీబీ డైరెక్టర్ బంటు శ్రీనివాస్, కోలా రామస్వామి, గుడిసె దుర్గాప్రసాద్, కోలా వెంకన్న, కోలా శ్రీను, నక్క శేఖర్, కొంక శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

జొన్న సాగుకు అనువైన సమయమిదే

- నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు




జొన్న పంట

నడిగూడెం: రాష్ట్రంలో మెట్ట ప్రాంతాల్లో వర్షాధారంగా సాగు చేసుకునే పంటల్లో జొన్న ముఖ్యమైన పంట అని, జొన్న పంట సాగుకు అనువైన సమయమిదేనని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం.రాజగోపాలరావు చెబుతున్నారు. జొన్న సాగులో రైతులు అనుసరించాల్సిన పద్ధతులకు సంబంధించిన సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

నేలలు మరియు నేల తయారీ

తేలికపాటి ఎర్ర చెల్క నేలలు, తేమను నిలుపుకొనే నల్లరేగడి నేలలు జొన్న పంట సాగుకు అనుకూలం. చౌడు నేలలు మరియు మురుగు నీరు నిల్వ ఉండే నేలల్లో ఈ పంట వేసుకోరాదు. నేలను 2 నుంచి 3 సార్లు బాగా దున్ని చదును చేసుకొని జొన్న విత్తనాలు విత్తుకోవాలి.

విత్తే సమయం: వర్షాభావాన్ని బట్టి జొన్న పంటను జూన్ నెల మొదటి 15రోజుల నుంచి జులై నెల చివరి వరకు విత్తుకోవచ్చు.

అనువైన విత్తన రకాలు : సీఎస్‌హెచ్-9, సీఎస్‌హెచ్ -16, సీఎస్‌హెచ్-23, సీఎస్‌హెచ్-25.

పంట కాలం : 105 రోజుల నుంచి 115 రోజుల వరకు

విత్తన మోతాదు : ఎకరానికి 3 నుంచి 4 కిలోలు

విత్తన శుద్ధి : కిలో విత్తనానికి 3 గ్రాముల థైరామ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తన శుద్ధి చేయాలి. మొవ్వ ఈగ నివారణకు గాను ఒక కిలో జొన్న విత్తనానికి 3 గ్రాముల థయోమిథాక్సామ్ లేదా ఇమిడాక్లోప్రిడ్ 7.0 మి.లీ. కలిపి విత్తన శుద్ధి చేయాలి.

విత్తే దూరం: వరుసల మధ్య 45 సెం.మీ., మొక్కల మధ్య 12 నుంచి 15 సెం.మీ. దూరంలో విత్తాలి. ఎకరానికి 68వేల నుంచి 72వేల మొక్కలు ఉంచాలి.

ఎరువుల యాజమాన్యం: పశువుల ఎరువు ఎకరానికి 3 నుంచి 4 టన్నులు వేసి, ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. వర్షాధారంగా సాగు చేసినప్పుడు ఎకరానికి 24 కిలోల నత్రజని, 12 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులను వేయాలి. అనగా విత్తే ముందు 25 కిలోల డీఏపీ, 22 కిలోల యూరియా మరియు 15 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి.

నీటి యాజమాన్యం: సాధారణంగా జొన్నను వర్షాధారంగా సాగు చేస్తారు. అయితే వర్షాధార పరిస్థితులు ఎక్కువ రోజులు ఏర్పడినప్పుడు పూత, గింజ కట్టే దశలో ఒక తడి ఇస్తే మంచి దిగుబడులు తీసుకోవచ్చు.

అంతర పంటలు: జొన్నలో కంది పంటను 4 :1 నిష్పత్తిలో అంతర పంటగా వేసుకోవాలి.

కలుపు నివారణ: విత్తిన 30 రోజులకు లేదా దంతితో వరుసల మధ్య అంతరకృషి చేయడం వలన పొలంలో తేమ నిలిచి మొక్కలు బాగా పెరుగుతాయి. విత్తిన రెండు వారాల లోపుగా ఒత్తు మొక్కలను తీసివేయాలి. కలుపును నివారించేందుకు అట్రాజిన్ 50 శాతం పొడి మందును ఎకరానికి 800 గ్రాములు చొప్పున 250 లీటర్ల నీటిలో కలిపి విత్తిన వెంటనే లేదా 2వ రోజు లోపల తడి నేలపై పిచికారీ చేయాలి.

పంట కోత: కంకి కింద వరుసలో ఉన్న గింజలు ఆకుపచ్చ రంగు నుంచి తెల్లగా మారి గింజలో నున్న పాలు ఎండిపోయి పిండిగా మారినప్పుడు, గింజ కింది భాగంలో నల్లటి చార ఏర్పడిన తర్వాత పంట కోయాలి.

పంట దిగుబడి: ఎకరానికి 12 నుంచి 16 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుంది. అలాగే చొప్ప అయితే 30 నుంచి 32 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.